క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో గురువారం ఉదయం 10–30 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు కౌన్సిల్ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు : 79వ స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా బుధవారం మున్సిల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయకుమార్ సర్కిల్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశ భక్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించామన్నారు. ఆగస్టు 15న ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయాల సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి నియమాకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ధర్మకర్తల నియామకంలో 50శాతం ఎస్సీ, ఎస్టీ మహిళలు, బీసీ, ఓసీలకు చెందిన ఎవరైనా దరఖాస్తు చేసుకోవన్నారు. ధర్మకర్తల మండలిలో సభ్యులుగా ఉండేందుకు ఆసక్తి కలిగిన వారు 20 రోజులలోగా దరఖాస్తు చేసుకోవాలని ఈఓ చెప్పారు.

ఎమ్మెల్సీ పరామర్శ



శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నాయకులు

పోరుమామిళ్ల: పట్టణంలోని కోటవీధికి చెందిన శ్రీను అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బుధవారం శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, జిల్లా డాక్టర్ల విభాగం కార్యదర్శి డాక్టర్ కల్యాణ చక్రవర్తి, పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, రమణయ్య, రాము, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారి

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. బుధవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో గర్భిణులు తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు జరిపి హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా గర్భవతిగా నమోదు అయిన వెంటనే టీకాలు వేయించుకుని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అందరూ తప్పక 108 వాహనం ఉపయోగించుకుని ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. 20 మంది గర్భిణులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జానీవిలియం, స్టాఫ్ నర్సులు సునీత, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు,, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : ఒంగోలులో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ సూపర్ 6 పథకాలకు తిలోదకాలు ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. ఈ మహాసభల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సీపీఐ నాయకులు ధనిరెడ్డి శివారెడ్డి, గోపాలం, రామకృష్ణ, మద్దిలేటి, ప్రమీల, యల్లయ్య, పీటర్ పాల్గొన్నారు.

యూరియా.. ఏదయ్యా?



యూరియా బస్తాలను తీసుకెళుతున్న రైతులు



యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు (ఫైల్)

- టీడీపీ నేతల కనుసన్నల్లో పంపిణీ
- నష్టపోతున్న అన్నదాతలు

ప్రొద్దుటూరు : గ్రామాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లోనే యూరియా బస్తాల పంపిణీ జరుగుతుండటంతో సాధారణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలకు పెద్దపీట వేశారు. ఎరువులన్నీ ముందుగా రైతు భరోసా కేంద్రాలకు తీసుకొచ్చి పంపిణీ చేసేవారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా ముందుగా యూరియాను బహిరంగ మార్కెట్‌లోని దుకాణాలకు తరలించి అమ్మిన తర్వాత గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం గ్రామాల్లో యూరియా బస్తాలు తమకు దొరికే పరిస్థితి లేకపోవడానికి టీడీపీ నేతలే కారణమని అన్నదాతలు వాపోతున్నారు. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి ఇప్పటి వరకు 160 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైంది.

అధికారులపై ఒత్తిడి

మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు వీటిని అందించాల్సి ఉంది. కాగా కొన్ని గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కాకున్నా రైతు సేవా కేంద్రాల్లోని కౌంటర్‌లో కూర్చొని తమకు అనుకూలమైన వారికి యూరియా బస్తాలను ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఉప్పరపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. స్థానిక టీడీపీ నాయకుడితో పాటు మరికొంత మంది కౌంటర్‌లో కూర్చొని యూరియా బస్తాలను ఇప్పించారు. ఇప్పటి వరకు ఉప్పరపల్లె రైతు సేవా కేంద్రానికి 30 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా చాలా మంది రైతులు తమకు యూరియా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



ఖాజీపేట : పులివెందుల, ఒంటిమిట్టు జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి నేతలు అరాచకం సృష్టించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు, ఎన్నికల కమిషన్, ప్రభుత్వం కలసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల నియమావలిని అతిక్రమించి తిరిగి వైఎస్సార్‌సీపీ నేతల పైనే అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటని అన్నారు. ఈ ఎన్నికలు దేశ చరిత్రలోనే మాయని మచ్చగా నిలిచిపోతాయని అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడం, దాడులు చేసి, విచ్చల విడిగా డబ్బులు పంచి గెలవాలని భావించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. రెండు ఉప ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండిపడ్డారు. అన్యాయం, అక్రమాలతో గెలవాలనుకుంటే ప్రజలు ఒప్పుకోరని చెప్పారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉండేలాగా పోలీసులు వ్యవహరించాలని తెలిపారు. 15 బూతుల్లో అక్రమాలు జరిగితే కేవలం రెండు బూతుల్లో మాత్రమే రీపోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. అందుకే రీపోలింగ్‌ను వైఎస్సార్‌సీపీ బహిష్కరిస్తోందని తెలిపారు. కూటమి పాలనకు ప్రజలు ముగింపుపలికేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రమేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా ఆసుపత్రుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నిరకాల ప్రమాణాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రుల్లో పనిచేసే వివిధ విభాగాల వైద్యుల పేర్లు రిజిస్ట్రేషన్ నెంబర్లతో సహా ప్రదర్శించాలని తెలిపారు. అలాగే స్కానింగ్ మిషన్ ఉంటే దాని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని తెలిపే బోర్డులను ప్రదర్శించాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ మహబూబ్‌బాష, హెల్త్ అసిస్టెంట్లు శ్రీరాములయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

పోరుమామిళ్ల: ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఒత్తిడికి దూరంగా ఉండాలని ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ సూచించారు. డాక్టర్ రమేష్ పర్యవేక్షణలో 'స్ట్రెస్ అండ్ మేనేజ్‌మెంట్'పై అవగాహన కల్పించారు. సిబ్బందిలో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, ఉద్యోగ సంబంధిత ఒత్తిడిని గుర్తించడం, బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడానికి శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్టాఫ్ నర్సులు, ఆరోగ్యవిద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, ఫిజియోథెరపిస్టు ఆనంద్‌బాబు, శిల్ప పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



చాపాడు: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి దేవి పద్మలత



బి.కోడూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

బి.కోడూరు : పంటల సాగులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బి.కోడూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ 2025లో పంటలు సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరి, మినుము పంటలలో సాగు మెళకువలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి తెలియజేశారు. అలాగే వివిధ పథకాలు, సబ్సిడీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ కౌశిక, వీఏఏ షణ్ముఖ్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని లింగాలదిన్నె, గడ్డమాయపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నోటిఫైడ్ చేసిన వరి, పసుపు, కంది, మినుము, ఉల్లి, జొన్న పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు గురువారంతో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన ఆయా పంటలకు వెంటనే ప్రీమియం చెల్లించాలని సూచించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

చాపాడు: రైతులు వ్యవసాయ పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట, విశ్వనాథపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పేడ ఎరువులను అధికంగా వాడాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. యూరియాను తగిన మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు. వరి సాగుకు ముందు పచ్చి రొట్ట కోసం జీలువ, జనుమును వేసుకోవాలని, వీటి ద్వారా పంటకు పోషకాలు లభిస్తాయన్నారు. అనంతరం రైతుల పంట పొలాలను వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, వీఏఏలు శివలక్ష్మి, సుప్రియ పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : అవయవదానంతోనే పునర్జన్మ సాధ్యపడుతుందని, మరణానంతరం కూడా ఏదో ఓ రూపంలో జీవిస్తుంటామని కొవ్వూరు గ్రాండ్ చైర్మన్, అవయవ గ్రహీత కొవ్వూరు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొవ్వూరు గ్రాండ్‌లో బుధవారం 'ప్రపంచ అవయవదాన దినోత్సవం' సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అవయవ దానం వల్ల భయపడాల్సిన అవసరం లేదని అవయవ మార్పిడి జరిగిన వారు కూడా సంతోషంగా గడపవచ్చన్నారు. అవయవ మార్పిడి కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, కిడ్నీ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేయిస్తోందని తెలిపారు.

కుందూ పరివాహక ప్రాంతాల వద్దకు వెళ్లవద్దు

రాజుపాళెం : కుందూనది పరివాహక గ్రామాల్లోని ప్రజలు నది వద్దకు వెళ్లొద్దని ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఆయన తన సిబ్బందితో మండలంలోని వెల్లాల పాత వంతెనపై ప్రవహిస్తున్న వరద నీటి ఉధృతిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైతట్టు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కుందూ నదిలో వరద నీరు అధికంగా వస్తోందన్నారు. నదిలో ప్రవహిస్తున్న నీటిని చూసేందుకు వెళ్లొద్దని.. ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. పంట పొలాలకు వెళ్లే రైతులు చాలా జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. వెల్లాల పాత వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిపివేశామని, ప్రొద్దుటూరు ఆళ్లగడ్డ వయా గోపల్లె మీదుగా వెళ్లే వాహనాలన్నీ పగిడాల గ్రామ వెలుపల ఉన్న బైపాస్ రహదారిలో హైలెవల్ వంతెనపై చాగలమర్రికి వెళ్లవచ్చని తెలిపారు.

లీకేజీ అరికట్టకుంటే తప్పదు వ్యథ!

ప్రొద్దుటూరు రూరల్ : స్థానిక రైల్వే ఫ్లైఓవర్ సమీపంలోని రామేశ్వరం ములుపు వద్ద గత కొన్ని రోజులుగా తాగునీటి పైపులైన్ లీకేజీ అయి నీరంతా వృథాగా పోతోంది. ఈ ప్రాంతంలో ప్రొద్దుటూరు రూరల్ ఏరియాకు తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్, రాజుపాళెం మండల పైపులైన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన పైపులైన్లు పక్క పక్కనే ఉన్నాయి. దీంతో లీకేజీ పైపులైన్ ఏ శాఖకు సంబంధించినదో ఆ అధికారులకే తెలియడం లేదు. లీకేజీ పైపు వద్ద జేసీబీ ద్వారా తవ్వితే కానీ ఆ పైపులైన్ మున్సిపాలిటీదా, రూరల్ ఏరియాకు చెందినదా లేదా రాజుపాళెం మండలానికి చెందినదా అర్థం కాని పరిస్థితి. వృథా నీరు రోడ్డుపై నిలబడటంతో పాటు ఖాళీ స్థలాలు నీటితో నిండిపోయి ప్రజలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డి దృష్టికి సాక్షి తీసుకెళ్లగా అక్కడ రాజుపాళెం, ప్రొద్దుటూరు రూరల్, మున్సిపాలిటీకి పైపులైన్లు ఉన్నాయని, జేసీబీతో తవ్వించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తామని తెలిపారు.



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

వీధి కుక్కల స్వైరవిహారం

– భయాందోళనలో ప్రజలు

కలసపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మండల కేంద్రమైన కలసపాడులోని స్టేట్ బ్యాంక్ వద్ద, పోరుమామిళ్ల రోడ్డులోని ఆర్సీఎం చర్చి వద్ద కుక్కలతో భయపడి ప్రజలు ఒంటరిగా వెళ్లలేకపోతున్నారు. బైక్‌లపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో బైక్ నుంచి కిందపడే ప్రమాదం ఉంది. గతంలో స్టేట్ బ్యాంక్ పక్కన ఖాళీ స్థలంలో ఓ చిన్నారి బయటికి వచ్చి ఇంటికి వెళుతున్న సమయంలో ఒక్క సారిగా కుక్కలు దాడి చేశాయి. ఈ విషయాన్ని గమనించిన అక్కడున్న వారు కుక్కల బారి నుండి చిన్నారిని కాపాడారు. ప్రధానంగా కుక్కల బెడద చికెన్ సెంటర్ల వద్ద ఎక్కువగా ఉంది. ప్రజలపై దాడి చేయడం, బైక్‌ల వెంట పడటంతో ఏది పిచ్చి కుక్క, ఏది మంచి కుక్కో తెలియక ఆందోళనలకు గురవుతున్నారు. ఇటీవల ఎగువ రామాపురంలో ఓ చిన్నారికి కుక్క దాడి చేసి గాయపరిచింది. ఇలాంటి సంఘటనలు పలు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. చిన్నారులను ఒంటరిగా తల్లిదండ్రులు బయటికి పంపించలేని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి కుక్కలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

అల్లాడుపల్లె సొసైటీ అభివృద్ధికి కృషి

చాపాడు: అల్లాడుపల్లె సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని, రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని అల్లాడుపల్లె రైతు సహకార సంఘం (సొసైటీ బ్యాంకు) పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా మార్తల నరసింహారెడ్డి తెలిపారు. అల్లాడుపల్లె సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా మార్తల నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సహకార సంఘం సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి బ్రహ్మానందరెడ్డితో అల్లాడుపల్లె సహకార సంఘం కమిటీ సభ్యులు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఇన్‌చార్జి చైర్మన్‌గా సీతారామాపురానికి చెందిన మార్తల నరసింహారెడ్డి, కమిటీ సభ్యులుగా మేకల సుదర్శన్‌బాబు (నెర్రవాడు), గోసుల చిన్న వీరయ్యగారి వీరారెడ్డి నియామక ఉత్తర్వులు అందుకుని బాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, సొసైటీ అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల మంజూరు ఎప్పుడు?

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్ బాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. కానీ అర్హుల జాబితా ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. కార్పొరేషన్ల నిధులను సంక్షేమ కార్యక్రమాలకు వాడటం వల్ల కార్పొరేషన్లు ఖాళీగా ఉన్నాయన్నారు. సబ్సిడీ రుణాలు పొంది స్వయం ఉపాధిగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవాలని ఆశగా ఎదురు చూస్తున్న యువతకు నిరాశా మిగులుతోందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

బద్వేలును వైఎస్సార్ కడప జిల్లాలోనే ఉంచాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి బండి జకరయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.పిచ్చయ్య, మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అత్యంత వెనుకబడిన బద్వేలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం మాని అక్కడ కలుపుతాం, ఇక్కడ కలుపుతాం అంటూ ప్రజలను గందరగోళానికి గురిచేయడం కూటమి ప్రభుత్వానికి తగదని అన్నారు. బద్వేలు నియోజకవర్గ ప్రజలు ఎంతో చైతన్యవంతులని, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే కూటమి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా బద్వేలు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలోకి చేర్చకుండా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శిఖామణి, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, దళిత సంఘాల నాయకులు ప్రసాద్, ఓబయ్య పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు మధురేసుదాసు, నిరంజన్ గోవింద దాసు పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడురోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు విశేష పూజాకార్యక్రమాలు అలంకరణ చేస్తున్నామన్నారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 4.30 గంటలకు శ్రీకృష్ణబలరాముల దర్శనం, హరినామ సంకీర్తన, కృష్ణలీలా ప్రవచనం, 7 గంటలకు గౌరహారతి, భగవద్గీతా ప్రవచనం, నాటక ప్రదర్శన, 10.30 గంటలకు మహాశంఖాభిషేకం, మహాపుష్పాభిషేకం, మహాహారతి, తీర్థప్రసాద వినియోగం చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి 40 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని భక్తులు పాల్గొనాలని, అలాగే భక్తులందరికి వెన్నలడ్డూలను అందిస్తున్నామన్నారు. 400 మంది ఇస్కాన్ బృందం, వలంటీర్లు, ఎన్‌సీసీ సిబ్బంది, భక్తులు సేవలందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు యు.వి.రమణయ్యయాదవ్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎస్.ఎన్.సుబ్బరాయుడు కోరారు. బుధవారం స్థానిక ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయ ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ బి.వి.రాజు, జిల్లా అధ్యక్షుడు జె.జయప్రకాష్‌లచే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన హక్కుల సాధన కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని బీసీలందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'గంగ' నీటిలోనే పంట పొలాలు

మైదుకూరు : మైదుకూరు మండలం మిట్టమానుపల్లెలో తెలుగు గంగలో భాగమైన బ్రహ్మంసాగర్ కాలువ నుంచి చెరువు అలుగు గుండా ప్రవహిస్తున్న నీటిలోనే పంట పొలాలు ఇంకా మునిగి ఉన్నాయి. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో మంగళవారం నీటి మునిగిన పంట పొలాలు శీర్షికతో కథనం ప్రచురితమైంది. మిట్టమానుపల్లె చెరువుకు నీటిని అందించే బ్రహ్మంసాగర్ కాలువ తూము మూతను దుండగులు ధ్వంసం చేయడంతో అధిక మొత్తంలో నీరు పంట పొలాలపై ప్రవహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నీటితో రైతులు సాగు చేసిన పసుపు, ఉల్లి, మిరప, కొత్తిమీర తదితర పంటలతోపాటు వరి నారుమడులు కూడా మునిగిపోయిన విషయం విదితమే. బుధవారం నీటి ప్రవాహం మరింత పెరిగి పంట కాలువలు సైతం వంకలను తలపిస్తున్నాయని రైతులు తెలిపారు.

తొంగి చూడని అధికారులు

దుండగులు దుశ్చర్యతో పెద్ద మొత్తంలో నీరు ప్రవహించి పంటలు మునిగిపోయినా అటు తెలుగు గంగ అధికారులు కానీ, ఇటు రెవెన్యూ అధికారులు కానీ తొంగి చూడలేదని బాధిత రైతులు వాపోయారు. బ్రహ్మంసాగర్ కాలువ తూము నుంచి పాయవంక గుండా ప్రవహించిన నీటితో చెరువు నిండడంతో పంట పొలాలపైకి వచ్చే నీటి ప్రవాహం తగ్గడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



నీట మునిగిన వరి నారు మడి

తక్షణమే పీఆర్సీ కమిషన్ నియమించాలి



ప్రొద్దుటూరు : ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు



బద్వేలు అర్బన్ : గ్యారేజీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు



మైదుకూరు : ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని ఎన్‌ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ టీఆర్‌జీ రెడ్డి, డిపో మాజీ సెక్రటరీ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే చెల్లించాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ వేతనాలు చెల్లించాలన్నారు. పారదర్శకంగా ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయాలని తెలిపారు. గవర్నర్‌పేట–2 డిపో స్థలాన్ని లూలు సంస్థకు కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ కమిటీ మెంబర్లు అయ్యవారప్ప, వై.బాబు, గ్యారేజీ సెక్రటరీ అశోక్, శేఖర్, దస్తగిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

మైదుకూరు : సమస్యల పరిష్కారం కోసం మైదుకూరు డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు రెండో రోజు బుధవారం ధర్నా నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ధర్నాలో అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మైదుకూరు తాలూకా ప్రధాన కార్యదర్శి మాచనూరు రాఘవయ్య, ఉపాధ్యక్షుడు పెంచల రెడ్డి, జాయింట్ సెక్రటరీ రామగుప్త, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జనార్ధన్, టెజరర్ బాబు మద్దతు తెలిపారు. ఎన్‌ఎంయూఏ డిపో సెక్రటరీ వీఎస్ రాయుడు, అధ్యక్షుడు ఎస్ఎన్ రాజు, గ్యారేజీ కార్యదర్శి వైఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

బద్వేలు అర్బన్ : ఆర్టీసీలో ఖాళీగా ఉన్న దాదాపు 8 వేల పోస్టులను డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ బద్వేలు తాలూకా కార్యదర్శి శివరామిరెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్యారేజీ గేటు ఎదుట నిర్వహించిన ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పారదర్శకమైన బదిలీల విధానాన్ని అమలు చేయడంతో పాటు ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈఓఎల్ మంజూరు చేయాలని కోరారు. తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం ద్వారా గాని సంస్థ ద్వారా గాని కొనుగోలు చేయాలని కోరారు. ఎన్‌ఎంయూఏ బద్వేలు డిపో ప్రెసిడెంట్ చిన్నపరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రావు, డిపో, గ్యారేజీ సెక్రటరీలు చంద్రయ్య, నాగేంద్ర, జాయింట్ సెక్రటరీ శ్రీధర్, హెచ్.నరసింహులు, కె.వి.రమణ, ఎం.ఎస్.రాయుడు, మల్లికార్జున పాల్గొన్నారు.